సాక్షి ప్రకాశం

గురువారం । 3 । జూలై । 2025



రూ.1 కోటి భూమి హాంఫట్

మార్కాపురంలో కోటి రూపాయల విలువైన చెన్నకేశవస్వామి ఆలయ భూములను కూటమి నేతలు ఆక్రమించి చదును చేశారు. - 8లో..



గ్రావెల్ మటాష్!

సింగరాయకొండ మండలంలోని జువ్వలగుంట చెరువులో టీడీపీ నాయకులు అక్రమంగా గ్రావెల్ తవ్వి విక్రయిస్తున్నారు. - 8లో..

గరిష్ఠం/కనిష్ఠం 35 /26

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

నేడు ప్రైవేట్ పాఠశాలలు బంద్

ఒంగోలు సిటీ: ప్రైవేట్ యాజమాన్యాలపై అతిగా స్పందిస్తున్న కొంతమంది అధికారులు తీవ్ర ఇబ్బందులు పెడుతున్న నేపథ్యంలో గురువారం అన్ని ప్రైవేటు అన్‌ఎయిడెడ్ పాఠశాలల బంద్ నిర్వహించనున్నట్లు అపుస్మ ఒంగోలు టౌన్ ప్రెసిడెంట్, కార్యదర్శి కాట్రగడ్డ మురళీకృష్ణ, వంశీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొంతమంది అధికారులు ప్రైవేట్ పాఠశాల యాజమాన్యాలపై అతిగా స్పందించడం, పాఠశాలలపై 3 మెన్ కమిటీలు, తనిఖీలను అమలు చేయడం చాలా దురదృష్టకరమన్నారు. కొన్ని ఏకపక్ష వార్తలు, కొంతమంది వ్యక్తుల లేఖలు, తప్పుడు ఫిర్యాదుల ఆధారంగా, ఎప్పటికప్పుడు నోటీసులు జారీచేయటం వాటిని వెంటనే అమలు చేయమనడం, కొంతమంది ఫీల్డ్ అధికారుల నుంచి అగౌరవకరమైన సందేశాలు, హెచ్చరికలు వంటి చర్యలు ప్రైవేట్ పాఠశాల యాజమాన్యాల్లో తీవ్ర వేదన కలిగిస్తున్నాయన్నారు. కొంతమంది అధికారులు తీసుకున్న అన్యాయమైన, ఏకపక్ష నిర్ణయాలతో ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ పాఠశాలలను ఆర్టీఈ 12.1.సీ దరఖాస్తుదారులను తగిన ధ్రువీకరణ లేకుండా చేర్చుకోవాలని బలవంతం చేయడం, పాఠశాలలను షోకాజ్ నోటీసులతో వేధించడం, గుర్తింపు రద్దు చేస్తామని బెదిరించడం వంటి చర్యలకు ప్రతిస్పందనగా రాష్ట్రంలోని అన్ని ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ పాఠశాలలు మూసివేయనున్నట్లు తెలిపారు.

సర్దార్ పటేల్ జాతీయ ఐక్యతా అవార్డుకు దరఖాస్తుల ఆహ్వానం

ఒంగోలు సిటీ: భారత ప్రభుత్వం 2025వ సంవత్సరానికి గాను జాతీయ ఐక్యతా దినోత్సవం సందర్భంగా అక్టోబర్ 31వ తేదీ జాతీయ స్థాయిలో జాతీయ ఐక్యత, సమగ్రత పై అత్యుత్తమ సేవ చేసిన వ్యక్తులు, సంస్థలకు సర్దార్ పటేల్ జాతీయ ఐక్యతా అవార్డు ప్రదానం చేస్తున్నట్లు సెట్విప్ సీఈఓ శ్రీమన్నారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అవార్డు కోసం జిల్లాలో ఆసక్తి కలిగిన వ్యక్తులు, సంస్థలు జాతీయ ఐక్యత, సమగ్రతపై వారు చేసిన విశేష కృషిని తెలియచేస్తూ తమ వివరాలను డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఎడబ్ల్యూఆర్‌డీఎస్.జీవోవీ.ఇన్ అనే వెబ్ సైట్‌లో ఈ నెల 9వ తేదీలోగా నమోదు చేసుకోవాలన్నారు. ఆ దరఖాస్తును, ఇతర వివరాలను ముఖ్య కార్యనిర్వహణాధికారి, సెట్విప్, జిల్లా యువజన సంక్షేమశాఖ, ఒంగోలు కార్యాలయంలో 9వ తేదీలోగా మూడు కాపీలు సమర్పించాలని కోరారు. ఇతర వివరాలకు కార్యాలయ పనివేళల్లో స్వయంగా కానీ లేదా ఫోన్ నంబర్ 91828 91095 ద్వారా తెలుసుకోవాల్సిందిగా కోరారు.

జాతీయ స్థాయి ఎల్ఎస్‌వీఎస్ శిక్షణకు విజయానంద్



సర్టిఫికెట్ అందుకుంటున్న ఉపాధ్యాయుడు విజయానంద్

సింగరాయకొండ: ఉత్తరప్రదేశ్‌లోని నోయిడాలో జాతీయ నాణ్యతా ప్రమాణాల సంస్థ ఆధ్వర్యంలో జూన్ 24, 25వ తేదీల్లో నిర్వహించిన ఎల్ఎస్‌వీఎస్ శిక్షణ కార్యక్రమంలో పాకల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బయాలజీ ఉపాధ్యాయుడు డీ విజయానంద్ పాల్గొన్నారు. ఈ శిక్షణకు రాష్ట్రం నుంచి 10 మంది ఉపాధ్యాయులు పాల్గొనగా జిల్లా ప్రతినిధిగా విజయానంద్ ప్రాతినిధ్యం వహించారు. బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ ఆధ్వర్యంలో నాణ్యతా ప్రమాణాల ద్వారా విజ్ఞాన శాస్త్రాన్ని అధ్యయనం చేసే పద్ధతులపై రెండు రోజులు శిక్షణ ఇచ్చారని విజయానంద్ వివరించారు. విజయవాడకు చెందిన బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్ వారు తనను నామినేటెడ్ చేశారని, శిక్షణ పూర్తి చేసిన వారికి సంస్థ డీజీఎం చిత్రాగుప్తా, డాక్టర్ ఎస్ సూర్యకళ్యాణి ధ్రువపత్రాలు అందజేశారన్నారు. ఈ శిక్షణ ద్వారా తాను నేర్చుకున్న విజ్ఞానంతో విద్యార్థులను సాంకేతికంగా తీర్చిదిద్దటానికి కృషి చేస్తానన్నారు.

కూటమి ప్రభుత్వం బరితెగించింది. జిల్లాలో ప్రతిష్టాత్మకమైన ట్రిపుల్ ఐటీకి మంగళం పాడేందుకు రంగం సిద్ధం చేసింది. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రెండు క్యాంపస్‌లకు భవనాల అద్దె, విద్యుత్ చెల్లించడం నిలిపేసి కుట్రలకు తెరతీసింది. ఏడాది తిరక్కుండానే ఒంగోలు నగరానికి ఐకాన్‌గా నిలిచిన ఈ కళాశాల భవనానికి తాళం వేసింది. పాలకుల అడ్డగోలు నిర్ణయంతో నిన్నటి వరకు వేలాది మంది విద్యార్థులతో కళకళలాడిన రావ్ అండ్ నాయుడు క్యాంపస్ నేడు కళావిహీనంగా మారింది. ఇక్కడ పనిచేస్తున్న సిబ్బందిని సైతం ఇబ్బందుల్లో పడేసింది. రానున్న రోజుల్లో ఎస్ఎస్ఎన్ క్యాంపస్‌కు ఇదే పరిస్థితి రానుంది. కళాశాలలో పనిచేసే ఫ్యాకల్టీ, విద్యార్థుల అభిప్రాయాలు తీసుకోకుండా క్యాంపస్‌ను ఎత్తివేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



ఒంగోలు టిపుల్ ఐటీ రావ్ అండ్ నాయుడు ఇంజినీరింగ్ కాలేజీ క్యాంపస్ భవనానికి తాళాలు వేసిన దృశ్యం

పచ్చ కుట్రలు.. భవితకు బీటలు!

- నిన్నటి దాకా వేలాది మంది విద్యార్థులతో కళకళ
- నేడు నిర్మానుష్యంగా రావ్ అండ్ నాయుడు క్యాంపస్
- అద్దె బకాయిలు రూ.2.5 కోట్లు
- బకాయిలు చెల్లించకపోవడంతో క్యాంపస్‌కు తాళం వేసిన భవన యజమాని
- కరెంటు బిల్లులు కోటి రూపాయలకు పైగా బకాయి
- విద్యార్థులు, ఫ్యాకల్టీలతో మూడు ముక్కలాట
- తర్వాత ఎస్ఎస్ఎన్ క్యాంపస్ వంతు
- మభ్యపెట్టిన అధికార టీడీపీ మంత్రులు, ప్రజాప్రతినిధులు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: ఒంగోలు ట్రిపుల్ ఐటీ ప్రారంభంలో సొంత భవనాలు లేకపోవడంతో ఇడుపులపాయ ఆర్కే వ్యాలీలో తరగతులు నిర్వహించారు. అక్కడ ఆర్కే వ్యాలీ విద్యార్థులకు, ఒంగోలు క్యాంపస్ విద్యార్థులకు మధ్య తరచుగా గొడవలు జరగడం మొదలయ్యాయి. సర్దిచెప్పే ప్రయత్నాలు చేసినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయింది. 2019లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ఇడుపులపాయలోని ఒంగోలు క్యాంపస్‌ను నగరంలోని రావ్ అండ్ నాయుడు క్యాంపస్‌కు తరలించింది. ఆ తరువాత విద్యార్థుల సంఖ్య పెరుగుతూ రావడంతో భవిష్యత్ అవసరాల దృష్ట్యా చీమకుర్తి రోడ్డులోని ఎస్ఎస్ఎన్ క్యాంపస్‌ను లీజుకు తీసుకుంది. అప్పటి నుంచి విద్యార్థులు ఎలాంటి గొడవలు లేకుండా ప్రశాంతంగా చదువుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఒంగోలు క్యాంపస్ విద్యార్థులకు సమస్యలు మొదలయ్యాయి.

అద్దె బకాయిలు రూ.2.50 కోట్లు:

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రావ్ అండ్ నాయుడు క్యాంపస్‌కు అద్దె చెల్లించడం నిలిపివేసింది. ఏడాది కాలానికి గాను రూ.2.50 కోట్లు చెల్లింపులు నిలిచిపోయాయి. దీంతోపాటుగా కళాశాల కరెంటు బిల్లులు చెల్లించడాన్ని పూర్తిగా నిలిపివేసింది. అధికారులు విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో తరచుగా విద్యార్థులు చీకటిలో మగ్గాల్సిన దుస్థితి ఏర్పడింది. చివరికి విద్యార్థులకు కనీసావసరాలకు నీరు అందుబాటులో లేకుండా చేసింది. గత్యంతరంలేక విద్యార్థులు నాల్గవ అంతస్తు నుంచి బకెట్లలో నీళ్లు మోసుకోవాల్సి వచ్చింది. కుట్రపూరితంగానే విద్యార్థులను కష్టపెడుతూ వచ్చిందన్న ఆరోపణలు ఉన్నాయి. చిట్ట చివరకు కాలేజీనే ఎత్తేసింది. ప్రస్తుతం క్యాంపస్‌లోనే కళాశాలకు చెందిన సామగ్రి, విద్యార్థుల మంచాలు, బెడ్‌షీట్లతోపాటుగా ఎగ్జామ్ సెల్ కు సంబంధించిన పరికరాలు ఉండిపోయాయి. తమకు రావల్సిన బకాయిలు చెల్లించమని అడుగుతున్న భవన యజమాని కళాశాలకు తాళం వేసేశారు. దిక్కుతోచని అధికారులు కళాశాలకు చెందిన సామగ్రి, ఇతర పరికరాలకు 10 మంది సెక్యూరిటీ గార్డులను కాపలా పెట్టారు.



ట్రిపుల్ ఐటీ కాలేజ్ బోర్డు

ఎస్ఎస్ఎన్ క్యాంపస్ కూడా ఎత్తేస్తారా...?

చీమకుర్తి రోడ్డులోని ఎస్ఎస్ఎన్ క్యాంపస్ లీజు 2026 డిసెంబర్ వరకు ఉంది. నాటి ప్రభుత్వం ముందు చూపుతో ఈ క్యాంపస్‌కు అడ్వాన్స్ చెల్లించడంతో ప్రస్తుత ప్రభుత్వం అద్దెలు చెల్లించకపోయినప్పటికీ క్యాంపస్ కొనసాగుతోంది. ఈ అడ్వాన్స్ అయిపోయాక ఎస్ఎస్ఎన్ క్యాంపస్‌ను కొనసాగించడం కూడా ప్రశ్నార్థకమేనని సిబ్బంది, విద్యార్థులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఎందుకంటే ఈ క్యాంపస్‌కు సైతం కూటమి ప్రభుత్వం కరెంటు బిల్లులు చెల్లించడం లేదు. ప్రస్తుతం రూ.2 కోట్లు వరకూ కరెంటు బిల్లు బకాయి ఉన్నట్లు సమాచారం. రావ్ అండ్ నాయుడు తరహాలో దీన్ని కూడా పూర్తిగా ఎత్తివేసేందుకు కూటమి పాలకులు కుట్రలు చేస్తున్నట్లు ప్రచారం జోరుగా సాగుతోంది.



నిర్మానుష్యంగా ఉన్న రావ్ అండ్ నాయుడు కాలేజీలోని ట్రిపుల్ ఐటీ క్యాంపస్

నూజివీడు క్యాంపస్‌లోనే కౌన్సెలింగ్

2025–26 విద్యా సంవత్సరం ప్రారంభమైంది. అడ్మిషన్లు జరుగుతున్నాయి. సాంకేతిక విద్యాశాఖ అధికారులు జూన్ 23వ తేదీన ప్రొవిజనల్ లిస్టు విడుదల చేశారు. 30వ తేదీ నుంచి సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియ ప్రారంభమైంది. ఈ 5వ తేదీ వరకు కొనసాగనుంది. ఈ నెల 14వ తేదీ విద్యార్థులు క్యాంపస్‌లో రిపోర్టు చేయాల్సి ఉంది. 15వ తేదీ నుంచి తరగతులు ప్రారంభమవుతాయి. ఒంగోలు క్యాంపస్‌కు సంబంధించిన అడ్మిషన్లు నూజివీడులో జరుగుతున్నాయి. కొత్తగా వచ్చే పీయూసీ 1 విద్యార్థులను నూజివీడులోనే కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకొంది. దీంతో ఒంగోలు క్యాంపస్‌ను మూడు ముక్కలు చేసినట్లయింది. ప్రభుత్వం అడ్డగోలుగా తీసుకున్న నిర్ణయం తమ పిల్లల చదువులపై తీవ్ర ప్రభావం చూపించే అవకాశం ఉందని విద్యార్థుల తలిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

క్యాంపస్ తరలిపోదంటూ మభ్యపెట్టి..

కొత్త విద్యా సంవత్సరం నుంచి రావ్ అండ్ నాయుడు క్యాంపస్ ఉండదని 'సాక్షి' వెలుగులోకి తెచ్చింది. వరుస కథనాలు ఇవ్వడంతో ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రులు, పలువురు ప్రజాప్రతినిధులు విద్యార్థులను, వారి తల్లిదండ్రులను మభ్య పెట్టారు. క్యాంపస్ ఎక్కడికీ వెళ్లదంటూ చెప్పుకొచ్చారు. అధికారులతో సమావేశాలంటూ డ్రామాలకు తెరతీశారు. వారి మాటలన్నీ అబద్ధాలే అని నెల రోజుల తర్వాత స్పష్టమైంది. క్యాంపస్‌కు తాళాలు వేయడంపై విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు, విద్యార్థి సంఘాలు మండిపడుతున్నాయి. కూటమి పాలకులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రాజీనామా బాటలో ఫ్యాకల్టీలు...

రావ్ అండ్ నాయుడు క్యాంపస్‌లో 150 మంది వరకు ఫ్యాకల్టీ పనిచేస్తున్నారు. క్యాంపస్ ఎత్తివేయడంతో ఈ ఫ్యాకల్టీని ఇడుపులపాయ, నూజివీడు, ఒంగోలు ఎస్ఎస్ఎన్ క్యాంపస్‌లకు సర్దుబాటు చేస్తున్నారు. ఇక్కడ కూడా అయినవారికి కంచాల్లో వడ్డిస్తున్నారు. తమకు సానుకూలంగా వ్యవహరిస్తున్న ఫ్యాకల్టీలను కోరిన చోట పోస్టింగులు ఇస్తున్నారని, మిగిలిన వారిని తమకు ఇష్టమైన చోటుకు బదిలీ చేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముందస్తుగా ఎలాంటి సమాచారం ఇవ్వకుండా క్యాంపస్ ఎత్తేయడంతో ఫ్యాకల్టీలు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. కుటుంబ సభ్యులను తీసుకొని ఎక్కడికో వెళ్లలేక సుమారు 50 మంది ఫ్యాకల్టీలలో కొందరు దీర్ఘకాలిక సెలవులు పెట్టుకోగా, మరికొందరు రాజీనామా చేసినట్లు తెలిసింది. మరో 40 మంది బదిలీల విషయంలో వెసులుబాటు కల్పించాలని డైరెక్టర్‌కు వినతిపత్రం అందజేసినట్లు సమాచారం. దీంతో అధ్యాపకుల కొరత ఏర్పడింది.

వర్జీనియా పొగాకు రైతుల సమస్యలు పట్టవా



టంగుటూరు వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావుకి వినతి పత్రం అందిస్తున్న నాయకులు

టంగుటూరు: వర్జీనియా పొగాకు రైతుల సమస్యలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు పట్టవా అని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కే వీరారెడ్డి అన్నారు. స్థానిక వేలం కేంద్రం నిర్వహణాధికారి శ్రీనివాసరావుకు పొగాకు రైతుల సమస్యలపై బుధవారం వినతి పత్రం అందించారు. ఆరుగాలం శ్రమించి పండించిన పొగాకు పంటకు గిట్టుబాటు ధర లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. పొగాకు రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. రైతులు పండించిన ఏ పంటకు సరైన గిట్టుబాటు ధర లేదని అన్నారు. రైతులు పండించిన పొగాకు గతంలో క్వింటా రూ.36 వేలు పలికినా నేడు రూ.28 వేలు కూడా ఇవ్వటం లేదన్నారు. వ్యాపారుల సిండికేట్ ముసుగులో రైతులను దగా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సంవత్సరం నష్టాల నుంచి కాపాడాలని కోరారు. రైతులకు అండగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం పనిచేస్తుందని తెలిపారు. రైతులు తెచ్చిన పొగాకును వెనక్కి తీసుకెళ్లకుండా పొగాకు వేలం కేంద్రం అధికారులు చూడాలన్నారు. పొగాకు కంపెనీలపై ఒత్తిడి తెచ్చి రైతుల పొగాకును గిట్టుబాటు ధరలకు కొనేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం కేంద్ర వాణిజ్య శాఖ మంత్రికి పొగాకు రైతుల సంతకాలతో కూడిన వినతిపత్రాన్ని వేలం నిర్వహణ అధికారికి అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి లక్ష్మి, ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి ప్రభాకర్, రైతు నాయకులు జీ ప్రసాద్, సుబ్బారెడ్డి, సుబ్బారావు, కిరణ్, కోటేశ్వరరావు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలి



పీటీసీలో సబ్ ఇన్‌స్పెక్టర్ల శిక్షణ పర్యవేక్షిస్తున్న రాష్ట్ర ఎక్సైజ్ కమిషనర్, డైరక్టర్లు

- రాష్ట్ర ఎక్సైజ్ కమిషనర్ నిశాంత్ కుమార్

ఒంగోలు టౌన్: చట్టాలపై సమగ్రంగా అవగాహన పెంపొందించుకోవాలని, ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలని రాష్ట్ర ఎక్సైజ్ కమిషనర్ నిశాంత్ కుమార్ చెప్పారు. డైరక్టర్ ఆఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ రాహుల్ దేవ్ శర్మతో కలిసి బుధవారం ఒంగోలు పోలీసు ట్రైనింగ్ కాలేజీని సందర్శించారు. కాలేజీలో శిక్షణ పొందుతున్న 102 మంది ప్రొహిబిషన్, ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్లతో మాట్లాడారు. శిక్షణ జరుగుతున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్సైజ్ యాక్ట్, ఎన్‌డీపీఎస్ యాక్ట్‌ల ప్రకారం నిందితులను అరెస్టు చేయడం, కేసు నమోదు చేయడం వంటి విషయాలను వివరించారు. మహిళలను అరెస్టు చేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలను వివరించారు. చెక్ పోస్టు నిర్వహణలో అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. నిత్యం చట్టాల గురించి అధ్యయనం చేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ హేమంత్ నాగరాజు, అసిస్టెంట్ కమిషనర్ దయాసాగర్, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ షేక్ ఆయేషా బేగం, ఏఈఎస్‌లు, సీఐ, ఎస్సైలు, పీటీసీ అధికారులు పాల్గొన్నారు.





ఒంగోలులోని మంగమూరు రోడ్డులో రేషన్ షాపు నుంచి బియ్యం బస్తాలు తీసుకెళ్తున్న మహిళలు



బేస్తవారిపేటలో రేషన్‌దుకాణం వద్ద మహిళల పడిగాపులు

తప్పని పరేషాన్

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇంటింటికీ రేషన్ పంపిణీకి మంగళంపాడి దుకాణాల వద్దే రేషన్ ఇస్తుండటంతో కార్డుదారులకు ఇక్కట్లు తప్పడం లేదు. దూర ప్రాంతాల నుంచి రేషన్ సరుకులు తీసుకునేందుకు వచ్చిన లబ్ధిదారులు బుధవారం గంటల తరబడి క్యూలో నిలబడి రేషన్ తీసుకెళ్లాల్సి వచ్చింది. చాలా చోట్ల మహిళలు, వృద్ధులు బియ్యం బస్తాలను భుజాన పెట్టుకుని అతికష్టం మీద మోసుకుంటూ వెళ్లడం కనిపించింది.

- సాక్షి, ఒంగోలు



ఒంగోలులోని విలేకర్ల కాలనీలో రేషన్ దుకాణం వద్ద రాత్రి 7.30 సమయంలో బారులుతీరిన మహిళలు

రూ.1 కోటి భూమి హాంఫట్!


గతంలో సర్వే చేసి ఏర్పాటు చేసిన ఫెన్సింగ్ లోపలి వైపు భూమిని చదును చేసిన టీడీపీ నాయకులు

- చెన్నకేశవస్వామి ఆలయ భూమిపై కూటమి నాయకుల కన్ను
- సంక్రాంతి మండపం ఫెన్సింగ్ లోపల భూమి దర్జాగా చదును
- చూసీచూడనట్టుగా వ్యవహరిస్తున్న ఆలయ అధికారులు

సాక్షి టాస్క్‌ఫోర్స్:

మార్కాపురంలో ప్రసిద్ధిగాంచిన చెన్నకేశవ ఆలయానికి చెందిన భూములను కబ్జాల బారి నుంచి కాపాడుకుంటున్నట్లు గొప్పగా డప్పు వేస్తున్న పాలకులు.. కూటమి నాయకుల కబ్జా పర్వాన్ని మాత్రం కళ్లప్పగించి చూస్తున్నారు. చెన్నకేశవస్వామి ఆలయానికి చెందిన సుమారు రూ.కోటి విలువైన భూమిపై కన్ను వేసిన కూటమి నాయకులు ఆక్రమించేందుకు సర్వం సిద్ధం చేసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. శ్రీదేవి భూదేవి సమేత శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామివారికి భజంత్రీల ఇనాం కింద సుమారు 32 ఎకరాలు కేటాయించారు. అయితే ప్రభుత్వ అవసరాల నిమిత్తం వాటర్ ట్యాంకు, ఇళ్ల స్థలాలు తదితర నిర్మాణాల కింద కొంత భూమి పోగా ప్రస్తుతం సంక్రాంతి మండపం వద్ద పార్వేట నిమిత్తం 40 సెంట్ల స్థలం మిగిలింది. ఆ భూమిలో కూడా సొసైటీకి చెందిన స్థలం ఉందంటూ కూటమి నాయకులు జేసీబీలతో యథేచ్ఛగా చదును చేశారు. నాలుగేళ్ల క్రితం సంక్రాంతి మండపానికి చెందిన స్థలాన్ని సర్వేయర్ కొలత వేయగా చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత కొందరు టీడీపీ నాయకులు రూ.కోట్ల విలువచేసే ఆ భూమిని కాజేసేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. గతంలో సర్వే చేసి సంక్రాంతి మండపానికి కేటాయించిన భూమిలో సొసైటీ పేరుతో అక్కడ ఇంకా స్థలం ఉందని చెబుతుండటం అనుమానాలకు తావిస్తోంది. కూటమి నాయకుల కబ్జా పర్వానికి అధికారులు పరోక్షంగా వత్తాసు పలకడం ఎంత వరకు సబబని భక్తులు ప్రశ్నిస్తున్నారు. సదరు ఆక్రమణలపై ఆలయ ఈఓ శ్రీనివాసరెడ్డిని వివరణ కోరగా.. సంక్రాంతి మండపం వద్ద సొసైటీకి చెందిన భూమి కొంత ఉందని కొందరు తమ దృష్టికి తెచ్చారని చెప్పారు. స్వామివారికి చెందిన భూమిని కొందరు చదును చేస్తున్నట్లుగా తన దృష్టికి వచ్చిందని అంగీకరించారు. అధికారులతో సమీక్షించి ఆలయానికి చెందిన భూమిని ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు.


సంక్రాంతి మండపం స్థలానికి వేసిన ఫెన్సింగ్

జిల్లా హామీ అమలు చేశాకే పవన్ మార్కాపురంలో అడుగు పెట్టాలి

- వైఎస్సార్ సీపీ ఐటీ విభాగం జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరెడ్డి

పెద్దదోర్నాల: మార్కాపురాన్ని జిల్లా చేస్తామన్న హామీని అమలు చేసిన తర్వాతే డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పశ్చిమ ప్రకాశంలో అడుగు పెట్టాలని వైఎస్సార్ సీపీ ఐటీ విభాగం జిల్లా అధ్యక్షుడు దొండేటి నాగేశ్వరరెడ్డి పేర్కొన్నారు. పవన్ మార్కాపురం పర్యటన నేపథ్యంలో బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. 2024 ఎన్నికల ప్రచార సమయంలో కూటమి నేతలు చంద్రబాబు, పవన్ కళ్యాణ్ మార్కాపురాన్ని జిల్లా చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కూటమి అధికారంలోకి వచ్చి ఏడాదైనా ఆ హామీ ఊసే లేదని మండిపడ్డారు. వెలిగొండ ప్రాజెక్టు పనులు పూర్వ స్థితిలోనే ఉన్నాయని, ప్రాజెక్టుకు నీరు విడుదల చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టకుండా ఏడాది కాలంగా కూటమి ప్రభుత్వం తాత్సారం చేస్తోందని ధ్వజమెత్తారు. ప్రజల సమస్యలపై కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని ఆరోపించారు. మోసపూరిత హామీలతో ప్రజలను దగా చేస్తున్న కూటమి ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయన్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి


మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

మార్కాపురం: ఈనెల 4వ తేదీన డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ మార్కాపురంలో పర్యటిస్తున్న నేపథ్యంలో అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా ఆదేశించారు. బుధవారం ఆమె మార్కాపురం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ, సబ్ కలెక్టర్ త్రివినాగ్‌తో కలిసి డిప్యూటీ సీఎం పర్యటన ఏర్పాట్లపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. జలజీవన్ మిషన్ కింద 18 మండలాల ప్రజలకు తాగునీరు అందించే పథకానికి డిప్యూటీ సీఎం శంకుస్థాపన చేయనున్నారని చెప్పారు. హెలీప్యాడ్, సభావేదిక వద్ద పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. సమీవేశంలో ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, జనసేన ఇన్‌చార్జి ఇమ్మడి కాశినాథ్, డీఎస్పీ నాగరాజు, సీఐ సుబ్బారావు, తహసీల్దార్ చిరంజీవి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ ఐటీ విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా చిట్యాల



హనుమంతునిపాడు: వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఐటీ విభాగ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా చిట్యాల విజయ్ భాస్కర్‌రెడ్డి ఎంపికయ్యారు. హనుమంతునిపాడు మండలం పెద్దగొల్లపల్లి గ్రామానికి చెందిన విజయభాస్కర్‌రెడ్డిని పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నియమించినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం బుధవారం ఓ ప్రకటనలో తెలిపింది. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి దద్దాల నారాయణ, నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

7న బోయలపల్లెలో రాష్ట్ర స్థాయి ఎడ్ల పందేలు

యర్రగొండపాలెం: మండలంలోని బోయలపల్లె గ్రామంలో వెలసిన ఆత్మానంద అవధూత స్వాముల వారి ఆలయ 56వ వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 7వ తేదీ రాష్ట్ర స్థాయి పాలపండ్ల ఎడ్ల (6 పండ్ల సైజులోపు) పందేలు నిర్వహించనున్నట్లు ఆ స్వామి సేవా సంఘం బుధవారం తెలిపింది. ఈ పందేల్లో గెలుపొందిన ఎడ్ల యజమానులకు 1 నుంచి 5 బహుమతులు వరుసగా రూ.50 వేలు, రూ.40 వేలు, రూ.20 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు అందిస్తారని చెప్పారు. ఈ పందేల్లో పాల్గొనే ఎడ్ల యజమానులు తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. వివరాల కోసం సంఘ అధ్యక్షుడు మన్నెం అంజనేయులు, సెల్ నంబర్: 94415 86783కు సంప్రదించాలన్నారు.

దాణా సొమ్ము మేశారు!

- మర్రిపూడిలో పశువుల దాణా పేరుతో బస్తాకు రూ.600 చొప్పున వసూలు
- దాణా నిల్వ ఉన్నా పంపిణీ చేయకపోవడంపై అనుమానాలు
- 200 మంది రైతులు చెల్లించిన రూ.1.20 లక్షలు సొంత ఖాతాల్లోకి!
- రైతులు నిలదీయడంతో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానన్న నూతన పశువైద్యాధికారి


వైద్యశాల ముందు ఆందోళనకు దిగిన పశుపోషకులు


పశువైద్యాధికారి మణిశేఖర్‌ను ప్రశ్నిస్తున్న పశుపోషకులు

మర్రిపూడి: రాయితీపై ప్రభుత్వం అందించే పశువుల దాణా కోసం నగదు చెల్లించిన పశుపోషకులను ఆ శాఖ సిబ్బంది ముప్పతిప్పలు పెడుతున్నారు. పశువైద్యశాలలో దాణా నిల్వ ఉన్నా నగదు చెల్లించిన వారికి పంపిణీ చేయకపోవడంతో పశుపోషకులు ఆగ్రహించారు. బుధవారం మర్రిపూడి పశువైద్యశాల వద్దకు చేరుకుని ఆందోళన చేశారు. దాణా పేరుతో వసూలు చేసిన సొమ్మును సొంతానికి వాడుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. వివరాల్లోకి వెళ్తే.. మర్రిపూడి మండలంలోని కాకర్ల, మర్రిపూడి గ్రామాల్లో రెండు పశు వైద్యశాలలు ఉన్నాయి. వీటి పరిధిలో ఆవులు, ఎద్దులు 1570, గేదెలు 18,240, మేకలు 61,200, గొర్రెలు 16200 ఉన్నాయి. కాగా మర్రిపూడి పశు వైద్యశాలలో లైవ్‌స్టాక్ అసిస్టెంట్ ఖాజావలి, అటెండర్ సురేష్ పశుపోషకుల వద్ద రూ.555 విలువ చేసే 50 కిలోల పెల్లెట్ దాణా బస్తాకు రూ.600 చొప్పున వసూలు చేశారు. ఇద్దరు ధైర్యంగా పశువైద్యశాలలోనే మద్యం సేవించడం, అక్కడే పడుకోవడం, ఉన్నతాధికారులను సైతం లెక్క చేయకపోవడం గమనార్హం. రెండు నెలల క్రితం వల్లాయపాలెం, మర్రిపూడి, రాజుపాలెం, దుగ్గిరెడ్డిపాలెం, గంగపాలెం తదితర గ్రామాలకు చెందిన సుమారు 200 మంది పశుపోషకుల వద్ద సుమారు రూ.1.20 లక్షలు వసూలు చేసి ఇప్పటికీ దాణా ఇవ్వకపోవడంతో పశుపోషకులు రోజూ ఆస్పత్రి చుట్టూ చక్కర్లు కొడుతున్నారు. రెండు రోజుల క్రితం మర్రిపూడి వైద్యశాలలకు 44 బస్తాల దాణా వచ్చిన విషయం తెలుసుకున్న పశుపోషకులు బుధవారం ఆందోళన చేపట్టారు. దాణా పంపిణీ చేసే వరకు కదలబోమని భీష్మించారు. ఆస్పత్రిలో పరిస్థితి తెలుసుకున్న ఖాజావలి బుధవారం వైద్యశాలకు రాకపోగా, అటెండర్ సురేష్ స్టాక్ రూమ్‌కు తాళం వేసి పరారయ్యాడు. అతని ఆచూకీ కోసం రైతులు రోజంతా గాలించారు. ఉదయం విధులకు హాజరైన పశు వైద్యాధికారి మంచాల మణిశేఖర్ ఆందోళనకు దిగిన పశుపోషకులను చూసి విస్తుపోయారు. 'నేను వారం రోజుల క్రితం బాధ్యతలు చేపట్టాను. మీరు డబ్బు చెల్లించిన విషయం నాకు తెలియదు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తా' అని చెప్పడంతో రైతులు శాంతించారు.

గ్రావెల్ మటాష్..!

- జువ్వలగుంట చెరువులో గ్రావెల్ తవ్వేస్తున్న పచ్చ ముఠా
- గత వారం రోజులుగా రాత్రి వేళ సాగుతున్న అక్రమ దందా
- గ్రావెల్ తవ్వకాలపై పచ్చ తమ్ముళ్ల మధ్య తలెత్తిన విభేదాలు
- అక్రమార్కులకు సహకరిస్తున్న అధికారులు


జువ్వలగుంట చెరువులో అక్రమ గ్రావెల్ తవ్వకాలు జరిపిన దృశ్యం

సింగరాయకొండ: కూటమి అధికారంలోకి వచ్చింది మొదలు సింగరాయకొండ, టంగుటూరు మండలాల్లో గ్రావెల్ దందా యథేచ్ఛగా సాగుతోంది. అక్రమ తవ్వకాలకు పాల్పడుతోంది టీడీపీ నాయకులు కావడంతో ఇరిగేషన్, మైనింగ్, రెవెన్యూ, పోలీసు, పంచాయతీ అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు గట్టిగానే వినిపిస్తున్నాయి. వివరాల్లోకి వెళ్తే.. సింగరాయకొండ మండలంలోని మూలగుంటపాడు పంచాయతీ పరిధిలో ఉన్న జువ్వలగుంట చెరువులో టీడీపీ నాయకులు గద్దల్లా వాలిపోయారు. గడిచిన వారం రోజులుగా అక్రమంగా గ్రావెల్ తవ్వి సొమ్ము చేసుకుంటున్నారు. అనుమతి లేకుండా రాత్రి వేళల్లో జేసీబీలు, టిప్పర్లు, ట్రాక్టర్ల సాయంతో గ్రావెల్ తవ్వి తరలిస్తున్నా అధికారులు అటు వైపు కన్నెత్తి చూడటం లేదు. అమాత్యుడి ఆదేశాలతోనే అధికార గణం కళ్లు మూసుకుందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

భగ్గుమన్న విభేదాలు

చెరువులో గ్రావెల్‌ను పక్క గ్రామాలకు చెందిన టీడీపీ నేతలు అక్రమంగా తరలిస్తుండటంతో సొంత పార్టీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శానంపూడి గ్రామానికి చెందిన టీడీపీ నాయకుల అక్రమ గ్రావెల్ దందాకు వీఆర్‌ఓలు కూడా సహకరిస్తున్నారని, తమ గ్రామ చెరువులో వారి పెత్తనం ఏమిటని మూలగుంటపాడు నాయకులు మంత్రి స్వామి వద్ద పంచాయతీ పెట్టినట్లు తెలిసింది.

చోద్యం చూస్తున్న అధికారులు

వారం రోజుల నుంచి అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్నా అధికారులకు పట్టించుకోకపోగా పచ్చ నేతలకు సహకరిస్తుండటం విమర్శలకు తావిస్తోంది. రాత్రి వేళ పెట్రోలింగ్ విధుల్లో ఉన్న పోలీసులు కూడా గ్రావెల్ అక్రమ రవాణాను అడ్డుకునే ప్రయత్నం చేయకపోవడం ఆరోపణలకు బలం చేకూరుస్తోంది. చెరువులో గ్రావెల్ తవ్వకంతో శ్మశాన స్థలం ధ్వంసమైందని, కర్మకాండలకు ఇబ్బందిగా మారిందని సమీపంలోని వెంకటేశ్వరనగర్ కాలనీ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రావెల్ అక్రమ దందాకు అడ్డుకట్ట వేస్తారో లేదో వేచి చూడాల్సిందే.


చెరువులో తవ్విన మట్టిని డంప్ చేసిన దృశ్యం

ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య

తాళ్లూరు: కుటుంబ సభ్యులు మందలించారన్న కారణంలో ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన తాళ్లూరు మండలంలోని గుంటిగంగ దేవస్థానం సమీపంలో వృద్ధాశ్రమం ఎదుట బుధవారం ఉదయం వెలుగుచూసింది. పోలీసుల కథనం మేరకు.. తూర్పు గంగవరం గ్రామానికి బోగోలు బ్రహ్మం సెలూన్ దుకాణం నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారు. ఆయన పెద్ద కుమారుడు బోగోలు మహేష్(25) ప్రైవేట్ ఆస్పత్రిలో ల్యాబ్ టెక్నీషియన్ గా పని చేస్తున్నాడు. మహేష్ రోజూ మద్యం తాగి కుటుంబ సభ్యులతో గొడవ పడుతున్నాడు. మంగళవారం రాత్రి మద్యం తాగి వచ్చిన మహేష్.. చనిపోతానని చెప్పి ఇంట్లో చీర తీసుకుని వెళ్లిపోయాడు. తల్లిదండ్రులు ఫోన్ చేసినా సమాధానం ఇవ్వలేదు. వృద్ధాశ్రమం ఎదుట చెట్టుకు మహేష్ ఉరేసుకున్నాడని అతని తల్లిదండ్రులకు బంధువులు సమాచారం అందించడంతో బోరున విలపించారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎస్.మల్లికార్జునరావు తెలిపారు.


కుటుంబ సభ్యులతో బత్తుల రత్నం

హ్యాపీ బర్త్‌డే రత్నం మేడమ్

- ఘనంగా శతాధిక వృద్ధురాలి జన్మదిన వేడుక

ఒంగోలు సిటీ: ఒంగోలు నగరంలో శతాధిక వృద్ధురాలి జన్మదిన వేడుకను బుధవారం కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. నగరంలోని మామిడిపాలేనికి చెందిన రిటైర్డ్ టీచర్ బత్తుల రత్నం 103 ఏళ్లు పూర్తి చేసుకొని 104వ పడిలోకి అడుగుపెట్టారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు, బంధువులు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ వేడుక నిర్వహించారు. 1977లో ఉపాధ్యాయ వృత్తి నుంచి రిటైరైన రత్నం 48 ఏళ్ల నుంచి పెన్షన్ పొందుతుండటం విశేషం.

ఖైదీలతో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ముఖాముఖి


ఖైదీలతో మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి షేక్ ఇబ్రహీం షరీఫ్)

ఒంగోలు: ఖైదీలతో స్థానిక జిల్లా జైలులో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి షేక్ ఇబ్రహీం షరీఫ్ బుధవారం ముఖాముఖి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన వారితో మాట్లాడుతూ క్షణికావేశంలో తప్పులు చేసి కుటుంబాలకు దూరంగా ఉండడం, తద్వారా సమాజానికి భారంగా ఉండడం దురదృష్టకరమన్నారు. న్యాయవాదిని నియమించుకునే స్తోమతలేని ఖైదీలకు ఉచితంగా లీగల్ ఎయిడ్ డిఫెన్స్ సిస్టం ద్వారా న్యాయ సహాయం అందిస్తారన్నారు. ఖైదీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వంటశాల, స్టోర్ రూమును పరిశీలించి మరింత మెరుగైన వసతుల కోసం అవసరమైన సలహాలిచ్చారు. కార్యక్రమంలో జిల్లా జైలు సూపరింటెండెంట్ పి.వరుణ్‌రెడ్డి, వైద్యులు బ్రహ్మతేజ, చీఫ్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ జి.రవిశంకర్, డిప్యూటీ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ వీర రాఘవులు, జైలర్ యలమందయ్య తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి హాకీ పోటీలకు మైనంపాడు క్రీడాకారిణి


లోహితను అభినందిస్తున్న మైనంపాడు ఉపాధ్యాయులు

సంతనూతలపాడు: హాకీ ఇండియా ఆధ్వర్యంలో జార్ఖండ్ రాష్ట్రంలోని రాంచీలో నేటి నుంచి ఈనెల 12వ తేదీ వరకు జరగనున్న 15వ జాతీయ స్థాయి సబ్ జూనియర్ మహిళల హాకీ టోర్నమెంట్లో పాల్గొనే హాకీ ఆంధ్రప్రదేశ్ జట్టుకు మండలంలోని మైనంపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న ఆకుల లోహిత ఎంపికయ్యారని హెచ్ఎం డీవీఎల్ నరసింహారావు తెలిపారు. ఎంపికైన క్రీడాకారిణిని జిల్లా అసోసియేషన్ సెక్రటరీ సుందరరామిరెడ్డి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో శర్మ, పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఆకుల బ్రహ్మయ్య, పీఈటీ దాసరి శ్రీనివాసరావు, పీఈటీ తిరుమలశెట్టి రవికుమార్, స్కూలు ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బైక్ ఢీకొని వృద్ధుడు మృతి


మృతి చెందిన వెంకటస్వామి

తర్లుపాడు: ఎదురెదురుగా వస్తున్న మోటారు సైకిళ్లు ఢీకొన్న ప్రమాదంలో ఓ వృద్ధుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన తర్లుపాడు మండలంలోని ఓబాయపల్లి కలుజువ్వలపాడు మధ్య బుధవారం రాత్రి చోటుచేసుకుంది. కొండారెడ్డిపల్లికి చెందిన వెంకటస్వామి(65) అక్కడికక్కడే మృతి చెందగా పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న తర్లుపాడు పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

5న జాతీయ లోక్ అదాలత్

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.భారతి

ఒంగోలు: ఈ నెల 5న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్ ఎ.భారతి బుధవారం ఒక ప్రకటనలో సూచించారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని అన్ని న్యాయస్థానాల్లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. రాజీకి అర్హత కలిగిన క్రిమినల్, సివిల్ కేసులు, మోటారు వాహన ప్రమాద బీమా పరిహారం చెల్లింపు కేసులు, చెక్ బౌన్స్ కేసులు, వివాహ సంబంధ వ్యాజ్యాలను కక్షిదారుల ఆమోదంతో పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. లోక్ అదాలత్‌లో పరిష్కరించుకున్న కేసుల్లో తీర్పు అంతిమమని పేర్కొన్నారు. లోక్ అదాలత్‌లో పరిష్కరించుకున్న వ్యాజ్యాలకు సంబంధించి కోర్టుకు చెల్లించిన ఫీజును వాపసు పొందే అవకాశం ఉందని, ప్రీ సిట్టింగ్ రూపంలో ఇరువర్గాల ఆమోదంతో ముందస్తుగా వ్యాజ్యాల పరిష్కారానికి జిల్లా న్యాయసేవాధికార సంస్థ, సంబంధిత న్యాయవాదులు, మీడియేషన్ న్యాయవాదులు సహకరిస్తారన్నారు. ఎక్కువ సంఖ్యలో కేసుల పరిష్కారానికి సహకరించాలని పోలీసు, ప్రభుత్వ అధికారులు, న్యాయవాదులను జిల్లా ప్రధాన న్యాయమూర్తి కోరారు.